క్లుప్తంగా

గణేష్ నిమజ్జన ఏర్పాట్లు అభినందనీయం


మేయర్‌ను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ నేతలు

చిత్తూరు అర్బన్: నగరంలో గణేష్ నిమజ్జనానికి మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గం, యంత్రాంగం చేసిన ఏర్పాట్లు అభినందనీయమని ఉత్సవ కమిటీ నేతలు అభినందించారు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం నగర మేయర్ అముదను కలిసి సన్మానించారు. భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని కట్టమంచి చెరువు వద్ద కార్పొరేషన్ ఏర్పాటు చేసిన వసతులు సంతృప్తికరంగా, ఆహ్లాదకరంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నేతలు రామభద్ర, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ వద్దు

ఐరాల: రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు శుక్రవారం మండలంలోని కాణిపాకం జెడ్పీ హైస్కూల్లో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు జీపీఎస్ విధానాన్ని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలను ధరించి తమ విధులను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జీపీఎస్ రద్దు చేసి, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శాంతాదేవి, సురేంద్రబాబు, సురేష్, వినోద్, గీత, రాజీవ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీఎం కేంద్రం పరిశీలన


ఎస్‌పీఎంను పరిశీలిస్తున్న డీఈ ఆనంద్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో నూతనంగా నిర్మిస్తున్న ఎస్‌పీఎం (ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు) కేంద్రాన్ని శుక్రవారం డీఈ ఆనంద్ ఏఈ మోహన్‌శెట్టితో కలిసి పరిశీలించారు. దాదాపు కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న కేంద్రాన్ని రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. పాత కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, రవాణా, సరఫరాకు స్థలం సరిపోవడం లేదన్నారు. దీంతో సంస్థ కొత్త కేంద్రాన్ని నిర్మించినట్లు వివరించారు. చిత్తూరులో రోజూ పది ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేస్తున్నామన్నారు. సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని కోరారు.

మెనూ ప్రకారం భోజనం

తవణంపల్లె: విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని ప్రత్యేక అవసరాల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని బాపినాయుడుపల్లె ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పిల్లలకు రుచికరమైన భోజనాలు పెట్టాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు చదవడంపై దృష్టి సారించాలని చెప్పారు. ఆయనతో పాటు ఎంఈఓ త్యాగరాజుల రెడ్డి, ఉపాధ్యాయుడు జయరామయ్య పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని కొంగారెడ్డిపల్లిలో ఉన్న ఆర్‌పీ లాడ్జీలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో మంటలు చెలరేగాయి. ఆ లాడ్జీ నిర్వాహకులు వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శాఖ లీడ్ ఫైర్‌మన్ నరేష్ బృందం ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.10 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించాలని ఆ లాడ్జి నిర్వాహకుడు ప్రభాకర్‌కు సూచించారు.

గరుడ వాహనం ఊరేగింపు


గరుడవాహనంపై వరదరాజుల స్వామి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయం శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా గరుడ వాహనం పురవీధుల్లో ఊరేగించారు. తిరుమల బ్రహ్మోత్సవాలలో గరుడ వాహనం సందర్భంగా కాణిపాకంలో వెలసిన శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని గరుడవాహనంపై కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు. స్వామివారి ఊరేగింపులో భక్తులకు స్వామివారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.




ప్రత్యేక పుష్పాలంకరణలో స్వాగత ద్వారం, ఆలయం చుట్టూ ప్రత్యేక అలంకరణ, ధ్వజస్తంభానికి పుష్పశోభ

నేత్ర పర్వం.. వరసిద్ధుని బ్రహ్మోత్సవం



అభిషేక పూజల్లో ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, భక్తులు, ఉత్సవమూర్తులకు గంధాభిషేకం చేస్తున్న అర్చకులు

జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవం నేత్ర పర్వంగా సాగుతోంది. సర్వాలంకార భూషితుడైన విఘ్ననాయకుడు శుక్రవారం స్వర్ణ శేష వాహనాలపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వాహన సేవల్లో కళా, సాంస్కృతిక ప్రదర్శనలతో స్వామివారికి కళా నీరాజనం సమర్పించారు. గణనాథుడికి శత కలశ క్షీరాభిషేకం కనులపండువలా సాగింది. ఆలయంలో ధ్వజస్తంభం నుంచి స్వాగత ద్వారాల వరకు చేసిన ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

– కాణిపాకం (యాదమరి)


నాట్యం చేస్తున్న కళాకారులు


నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు


హరికథను ఆలపిస్తున్న భాగవతారిణి


చిన్నశేష వాహన సేవకు శత క్షీర కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఉభయదారులు


సుగంధ పుష్పాలతో వినాయక స్వామి


ఆలయం ఎదుట కళాకారుల కోలాటం



దొండకాయలతో వినాయక స్వామి ప్రతిమ, వాహన సేవలో కోలాటమేస్తున్న మహిళలు

రేపు జైన్ మందిరంలో ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ ఉచిత నేత్రం శిబిరం ఉంటుందని చెప్పారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆపరేషన్‌కు ఎంపికైన వారికి ఉచితంగా సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

స్వర్ణోత్సవాల సభను జయప్రదం చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, జీవీ రమణ కోరారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం స్వర్ణోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 24న ప్రచార జాతా బైక్ ర్యాలీ, అక్టోబర్ 1న విజయవాడలో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నాట్లు చెప్పారు. దీనికి సంఘ సభ్యులు హాజరై జయప్రదం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రెడ్డెప్ప, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.


స్వర్ణోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మండపాల వద్ద జాగ్రత్తలు పాటించండి

చిత్తూరు కార్పొరేషన్: వినాయక మండపాల వద్ద, నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. మండపాలకు నాణ్యమైన విద్యుత్ తీగలు, జాయింట్లు లేని తీగలు వాడాలన్నారు. అలంకరణకు ఉపయోగించే సీరియల్, డెకరేషన్ లైట్లను కర్రలకు కట్టాలని, ఇనుప వస్తువులకు అమర్చవద్దని సూచించారు. బ్యానర్లు కట్టే సమయంలో విద్యుత్ తీగలకు తగలకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

నేడు ఇంద్ర వరదునికి కల్యాణోత్సవం

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన ఇంద్ర వరదుని ఆలయంలో శనివారం స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ, పెరటాసి నెల మొదటి శనివారం కావడంతో ఉదయం మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నట్లు వివరించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

గుడిపాల: ప్రస్తుత వర్షాకాలంలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతి సూచించారు. మండల పరిధిలోని పశుమంద ఎస్టీకాలనీ, తుమ్మలవారిపల్లెను శుక్రవారం సందర్శించారు. ఫ్రైడే డ్రైడే, జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

శుభ్రత పాటించాలి

చిత్తూరు కలెక్టరేట్ : పరిసరాల శుభ్రత పాటించాలని చిత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి కార్తిక్ అన్నారు. స్వచ్ఛ భారత్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఎన్‌సీసీ కేడెట్ల ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల వ్యర్థాలు పేరుకుపోతే రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలకు స్వచ్ఛత ఆవశ్యకతను తెలియజేశామన్నారు. గిరింపేటలోని పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత కలెక్టరేట్ ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో 35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ అజయ్ బాస్నట్, బీబీ చేత్రి, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.


పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

మరింత చేరువగా ప్రభుత్వ సేవలు


చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం

ప్రభుత్వం ప్రజా సేవకు పెద్దపీట వేస్తోంది. సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ముందడుగు వేసింది. ప్రజలకు ఇబ్బంది లేకుండా రెవెన్యూ సేవలను సులభతరం చేస్తోంది. ఈ ఫలితంగా రూరల్, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాల విభజనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తద్వారా రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసింది. అధికారుల కేటాయింపులో ముందడుగు వేసింది.

- రూరల్ మండలం ఏర్పాటు ప్రక్రియ వేగవంతం
- అధికారుల కేటాయింపులో ముందడుగు
- పాత భవనాల్లో కార్యకలాపాల నిర్వహణకు చర్యలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర, మండల ప్రాంతాలకు కలిపి మిట్టూరు ప్రాంతంలో తహసీల్దార్ కార్యాలయం ఉంది. ఇక్కడకు గ్రామీణ ప్రజలు నిత్యం 300 మందికిపైగా వచ్చేవారు. సచివాలయాలు వచ్చాక ఈ సంఖ్య కాస్త తగ్గుముఖం పట్టింది. కానీ భూ సమస్యలు తీరని వెతలుగా మారాయి. సర్వే సమస్యలు వేధిస్తున్నాయి. పత్రాల మంజూరులో జాప్యం చోటుచేసుకుంటోంది. దీనిపై అప్పట్లో మండల సర్వసభ్య సమావేశాల్లో అర్బన్, రూరల్ మండలాలు వేరు చేయాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. అప్పటి పాలకులకు విన్నమించుకున్నప్పటికీ పట్టించుకోలేదు. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూరల్, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాల ఏర్పాటుకు మోక్షం లభించింది.

శరవేగంగా విభజన ప్రక్రియ

చిత్తూరు తహసీల్దార్ కార్యాలయాన్ని అర్బన్, రూరల్‌గా విభజిస్తున్నట్లు ఈ ఏడాది మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. అప్పటి నుంచి ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం వేగంగా పనులు చేపడుతోంది. తొలుత గెజిట్‌కు అనుగుణంగా ప్రణాళికలు ప్రారంభించింది. మొత్తం 41 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 15 అర్బన్‌కు, 26 రూరల్‌కు కేటాయించింది. ముందుగా రూరల్‌కు 24 రెవెన్యూ గ్రామాలను మాత్రమే ప్రకటించింది. తాజాగా బండపల్లి, తేనెబండ రెవెన్యూ గ్రామాలను రూరల్ మండలంలో విలీనం చేశారు. ఈ ప్రాతిపదికన మ్యాప్‌లు సిద్ధం చేసి వర్గీకరణ పూర్తి చేశారు. అర్బన్ ప్రాంతాల్లో 17,800 ఎకరాల భూములు ఉన్నాయి. అలాగే రూరల్ మండల పరిధిలో 25,800 ఎకరాల భూములు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. తర్వాత అధికారుల కేటాయింపును పూర్తి చేసుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న తహసీల్దార్ మురళీ మోహన్‌ను, డీటీ కిరణ్, రీ సర్వే డీటీ ధనంజయ్యను అర్బన్‌లోనే ఉంచారు. రూరల్‌కు ఎన్నికల డీటీగా పనిచేస్తున్న అరుణకుమారిని తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్‌గా రమణి, రీసర్వే డీటీగా అశోక్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు వారు బాధ్యతలు స్వీకరించారు. త్వరితగతిన మిగిలిన సిబ్బందిని భర్తీ చేసేందుకు అధికారులు కసరత్తు పూర్తి చేస్తున్నారు. కార్యాలయ ఏర్పాటుకు సన్నహాలు జరుగుతున్నాయి. పాత కలెక్టరేట్‌లోని మైనింగ్ కార్యాలయాన్ని లేదా పాత డీపీఓ కార్యాలయాన్ని చూశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు.

విభజన పూర్తయితే...

విజభన పూర్తయితే రెవెన్యూ పరిపాలన సులభతరం కానుంది. ప్రజలకు సేవలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చోటుచేసుకుండా అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. సర్వే సమస్యలను అధిగమించే అవకాశం ఉంది. భూ సమస్యలపై తక్షణం స్పందించేందుకు వీలుగా ఉంటుంది. దళారీ వ్యవస్థ కనమరుగు కానుంది. ఇప్పటి వరకు కార్యాలయ ఆవరణలో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం జరుగుతోంది. కార్యాలయ విభజన తర్వాత వారి ఆటకట్టించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. వీఆర్‌ఏల పేరుతో పనిచేస్తున్న ప్రైవేటు వ్యక్తులను జరగబోయే ఎన్నికలకు ముందే ఇంటికి పంపేందుకు సిద్ధమయ్యారు.

పనిభారం నుంచి విముక్తి

రూరల్, అర్బన్ మండలాలు కలిపి సమస్యలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. రోజుకు కనీసం రెండు మూడు సమస్యలను పరిష్కరించడం కష్టతరమవుతోంది. క్షేత్రస్థాయికి వెళ్లడం, వారి వాదనలు వినడంతోనే ఒక్కరోజు గడిచిపోతోంది. కార్యాలయం ద్వారా చేయాల్సిన పనులు పెండింగ్ పడుతున్నాయి. అధికారులకు పనిభారం ఎక్కువైన తరుణంలో ఈ ప్రక్రియతో రాష్ట్ర ప్రభుత్వం మాకు మేలు చేసింది.


– ధనంజయ్య, రీసర్వే డీటీ, చిత్తూరు అర్బన్